క్లుప్తంగా

శ్రీరామ నవమి కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో వెలిసిన శ్రీరామస్వామి దేవాలయంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు శ్రీరామ నవమి పండుగ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ఏప్రిల్ 6న శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమేష్, చక్రి, శేషు, రాము, చంద్రబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం


పార్టీ స్థూపం ఆవిష్కరిస్తున్న నాయకులు

శింగనమల: సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీని బలోపేతం చేద్దామని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు అన్నారు. ఆదివారం మండలంలోని తరిమెల గ్రామంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ స్థూపం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేదల పాలిట పెన్నిధి, భూదాన కర్త తరిమెల నాగిరెడ్డి ఆశయాలను కొనసాగిద్దామన్నారు. పార్టీ నాయకుడు తరిమెల రామాంజినేయులు మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కిష్ట, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్ర, నాయకులు శీనప్ప, స్వర నాగప్ప, మారుతి, హరి, నాగరాజు, మునిరెడ్డి, ఆదెప్ప, దైవత్వం, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం


ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధనలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. విశ్వాసం లేకుండా దేవుడికి ఇష్టులై ఉండుట అసాధ్యమన్నారు. క్రీస్తు నందు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, వీరయ్య, జయరాజు, అబ్రహాం, బుజ్జిబాబు, కరుణాకర్, దేవదాసు, హోసన్నా, రాజు, బాబావలి, అల్లీపీరా, ప్రసాద్, రజని, పాస్టరమ్మ సువర్ణమ్మ, ప్రిస్కిల్లా, డాక్టర్ కమల, మెర్సీ, వాణి, మహిమ, రమాదేవి, లత తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి


మృతిచెందిన గొర్రె పిల్లలను చూపుతున్న కాపరి

పుట్లూరు: మండలంలోని చాలవేముల సమీపంలో మేత కోసం వెళ్లిన గొర్రెల మందపై కుక్కల గుంపు దాడికి పాల్పడటంతో 13 గొర్రె పిల్లలు మృతి చెందగా, 10 గొర్రెలు గాయపడ్డాయి. వివరాలు ఇలా ఉన్నాయి. చాలవేములకు చెందిన కాపరులు కిట్టయ్య, తిరుమలయ్య గొర్రెలను మేపుకోవడానికి పొలాల్లోకి వెళ్లారు. ఈ సమయంలో కొన్ని కుక్కలు మందపై దాడికి పాల్పడి గొర్రెపిల్లను కరిచి చంపేశాయి. గమనించిన కాపరులు వాటిని తరమడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. గాయపడిన గొర్రెలకు పశువైద్యాధికారి సువర్ణ వైద్యం అందించారు. దాదాపు రూ. 70వేలు నష్టం వాటిల్లినట్లు కాపరులు వాపోయారు.

డ్రైవర్ల వేతనాలు పెంచాలి

గార్లదిన్నె: తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ 102లో పనిచేస్తున్న డ్రైవర్ వేతనాలను పెంచాలని యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 31న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ టెండర్లు ముగుస్తాయన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా రూ.7870 వేతనంతో పని చేస్తున్నామన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పని చేస్తున్న తమను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని కొత్త టెండర్లు వేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.18,500 అందజేయాలని కోరారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించి, డ్యూటీలో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

సమస్యల నడుమ రక్తనిధి కేంద్రం

- నిండుకున్న రక్తం యూనిట్లు
- పనిచేయని రిఫ్రిజిరేటర్లు
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రి రూరల్: స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రక్త నిధి కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయి. ప్రధానంగా రక్తం యూనిట్లు నిండుకున్నాయి. రక్త నిల్వ కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ చేయాల్సి ఉండగా అరకొరగా యూనిట్లు ఉన్నాయి. రక్తం అవసరమైతే రోగుల బంధువులు స్వచ్ఛంద సంస్థల వైపు పరుగు తీయాల్సి పరిస్థితి. తాడిపత్రి ప్రభుత్వాస్పత్రి మూడు జిల్లా కేంద్రంగా ఉంది. సరిహద్దు జిల్లాల్లో ఏ చిన్న ప్రమాదం జరిగినా, గొడవలు జరిగినా క్షతగాత్రులు చికిత్స కోసం తాడిపత్రికి రావాల్సిందే. మరోవైపు తాడిపత్రి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. ఆయా పరిశ్రమల్లో పని చేసేవారికి గాయాలైతే తాడిపత్రి ఆస్పత్రికి తరలిస్తుంటారు. చికిత్సలో భాగంగా క్షతగాత్రులకు రక్తం ఎక్కించాలంటే వైద్యులు బిత్తరచూపులు చూడాల్సిందే. రక్త నిధి కేంద్రంలో రక్తం స్టాకు లేకపోవడంతో క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

రక్త నిధి కేంద్రంపై శీతకన్ను

2007లో తాడిపత్రి ఏరియా ఆస్పత్రిలో రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అవసరమైన రక్తం యూనిట్లను అనంతపురం నుంచి సరఫరా చేసుకోవాలి. అక్కడ కూడా అరకొరగా ఉన్నాయంటూ తక్కువగా పంపిస్తున్నారు. దీని కారణంగా స్థానిక రక్తం నిల్వ కేంద్రంలో పనిచేస్తున్న ల్యాబ్ అటెండర్ రక్తం కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. రక్త సేకరణ కోసం స్వచ్ఛంద సేవా సంస్థలు, ఇతర మార్గాల ద్వారా రక్త సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో మాదిరిగా వారు పూర్తి స్థాయిలో సహకరించకపోవడంతో రక్తం కొరత


రక్త నిల్వ కేంద్రం

ఏర్పడుతోంది. గతంలో వివిధ కార్యక్రమాల ద్వారా యువకులు రక్త దానం చేసే వారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో రక్త సేకరణ ఇబ్బందిగా మారుతోంది.

ఇద్దరు ల్యాబ్ టెక్నిషియన్‌ల పోస్టులు ఖాళీ

ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఇక్కడ విధులు నిర్వహించే వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. వారి స్థానంలో ఇతరులను కేటాయించడంలో జాప్యం చేస్తున్నారు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలోని ఎయిడ్స్ నియంత్రణ మండలిలోని ల్యాబ్ టెక్నీషియన్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. రక్త నిల్వ కేంద్రంలో ప్రస్తుతం ల్యాబ్ అటెండర్ మాత్రమే పనిచేస్తున్నారు.

శిథిలావస్థలో భవనం


దెబ్బతిన్న పైకప్పు

రక్త నిధి కేంద్రం గది శిథిలావస్థకు చేరుకుంది. ఏరియా ఆస్పత్రిలోని కొత్త భవనంలోకి మార్చడానికి జాప్యం జరుగుతోంది. వర్షం వస్తే కారుతోంది. పైకప్పు దెబ్బతిని వేసిన పీఓపీ ఊడిపోయింది. రక్త పరీక్షలకు సంబంధించిన పరికరాలను భద్రపరుచుకోవడానికి ఇబ్బందిగా ఉంది. అలాగే గది లోపలి భాగం అపరిశుభ్రంగా తయారైంది.

నిరుపయోగంగా రిఫ్రిజిరేటర్లు

రక్తం యునిట్లను భద్రపరచడానికి ఉన్న రెండు రిఫ్రిజిరేటర్లు పనిచేయడం లేదు. రక్త నిల్వ కేంద్రం ప్రారంభంలో వాటిని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి తరచూ మరమ్మతులకు గురికావడం, రిపేరి చేయడంతో కొన్నేళ్లపాటు కాలం గడిపారు. వాటికి కాలం చెల్లడంతో ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా ఉన్నాయి. రక్తం యూనిట్లు వచ్చినప్పుడు ఫ్రిజ్‌లో నిల్వ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.


నిరుపయోగంగా ఉన్న రిఫ్రిజిరేటర్

రక్త సేకరణ చేస్తున్నాం



అవసరమైన రక్తాన్ని సేకరిస్తున్నాం. వివిధ మార్గాల ద్వారా రక్త సేకరణ కోసం స్వచ్ఛంద సంస్థలను అడుగుతున్నాం. క్యాంప్‌లను పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. త్వరలో కొత్త భవనంలోకి రక్త నిల్వ కేంద్రాన్ని మార్చుతారు. నిరుపయోగంగా ఉన్న రిఫ్రిజిరేటర్ల స్థానంలో కొత్తవాటి కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– బాషా, ల్యాబ్ అటెండర్

ఈ-కేవైసీ చేయించుకోండి

గార్లదిన్నె: రేషన్ కార్డుదారులందరూ ఈనెల 31లోపు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ ఈరమ్మ సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలో రేషన్ కార్డులకు సంబంధించి 6,528 మంది సభ్యులు ఈ-కేవైసీ చేయించుకోలేదన్నారు. ఈ -కేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే ఏప్రిల్ లో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారన్నారు. ఈ-కేవైసీ చేయించుకోని జాబితా ఆయా గ్రామ సచివాలయం, రేషన్ దుకాణం, వీఆర్వో, సీఎస్‌డీల వద్ద ఉంటుందన్నారు. ఈ కేవైసీ చేయించుకోలేని వారు వెంటనే సంబంధిత అధికారుల వద్ద ఈ-పాస్ యంత్రంలో ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు.

పామిడి: రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ డీలీనా వసుంధర ఆదివారం తెలిపారు. ఐదు రోజుల్లోపు రిజిస్ట్రేషన్ సంఖ్య నమోదు ప్రక్రియను రైతులు పూర్తి చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి: పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, ఇంటర్ ఫస్టియర్ ఒకేషనల్ గ్రూప్(ఎంపీహెచ్‌డబ్ల్యూ-ఎఫ్)లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ రుద్రాక్షి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 11వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆరవ తరగతిలో 40 సీట్లు, ఇంటర్‌లో 40 సీట్లు ఉన్నాయన్నారు.

యల్లనూరు: మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విద్యాధికారులు చంద్రశేఖర్, పరమేశ్వర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అలాగే 7,8,9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఏప్రిల్ 11 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథ పిల్లలు, డ్రాప్ అవుట్, బడిబయట, బడి మానేసిన పిల్లలు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లల బాలికలు అర్హులన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు సేవా గుణం అలవర్చుకోవాలని నీలాంపల్లి సర్పంచ్ రసూల్ సూచించారు. మండలంని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నీలాంపల్లిలో ఏడు రోజుల పాటు జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్–4 ప్రత్యేక శిబిరం ఆదివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం సర్పంచ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ -4 అధిపతి డాక్టర్ లక్ష్మీనారాయణ, అరవింద్ బాబు, మధు సూధన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ఉద్యాన రైతులను ఆదుకోండి


మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: అకాల వర్షాలకు అరటి, మొక్కజొన్న పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన తన నివాసంలో మాట్లాడుతూ తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల్లో అరటి, మొక్కజొన్న పంటలు అకాల వర్షాల కారణంగా దెబ్బతింటే ఉద్యాన శాఖ అధికారులు ఎక్కడా కనిపించడం లేదన్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న పంటలను పరిశీలించాలన్నారు. అలాగే కలెక్టర్, వ్యవసాయశాఖ మంత్రి పొలాల్లో పర్యటించి నష్ట పరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

సంతల ఆదాయం రూ.4.61 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.4.61 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.2,79,050 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత ద్వారా రూ.1,82,090 మేర వసూలైనట్లు వెల్లడించారు.

28 నుంచి క్రికెట్ టోర్నీ

శింగనమల: మండంలోని కల్లుమడి గ్రామంలో ఈ నెల 28 నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈనెల 26 లోపు ఎంట్రీ ఫీజ్ రూ.1000 చెల్లించి ఆసక్తి ఉన్న జట్లు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విన్నర్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ.10 వేలు అందజేస్తామన్నారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తాం


గుంతకల్లులో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు


గుత్తిలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం


తాడిపత్రిలో భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్/గుత్తి/తాడిపత్రి రూరల్: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యాగం చేసిన భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లోని ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి జోహార్లర్పించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, సత్తార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కాలనీలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. నాయకులు ఓబులేసు, అబ్దుల్లా, సూరి తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తిలో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు వెంకప్ప, చంద్రశేఖర్, జిల్లా నాయకులు హసన్ బాషా, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, జేవీవీ జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తాడిపత్రిలో భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి, పట్టణ సహాయ కార్యదర్శి శ్రీరాములు, నాయకులు రామాంజి, నాగేంద్ర, అబ్రహం,నరేష్, నాగార్జున, గోవర్దన్, సీపీఎం నాయకుడు జగన్మోహన్‌రెడ్డి, పూసల సంఘం నాయకులు చంటి, సివిల్ సప్లై హమాలీ సంఘం నాయకులు శంకర్, శ్రీనివాసులు, కుమార్, కేవీపీఎస్ నాయకులు రామ్మోహన్, భవన నిర్మాణ సంఘం నాయకులు రామక్రిష్ణ, ఏపీ బీడీ, సిగార్ సంఘం నాయకులు ఉమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, మండల కార్యదర్శి కుళ్లాయప్ప, శివారెడ్డి, పుల్లయ్య, నాగరాజు, నెట్టి కంటయ్య, సంజీవరెడ్డి, వెంకటకొండ, తదితరులు పాల్గొన్నారు.


బీకేఎస్‌లో నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

పామిడి: పట్టణంలోని పాతబస్టాండ్ సర్కిల్‌లో ఉన్న భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం మండల నాయకుడు పీ అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేసు తదితరులు పాల్గొన్నారు.

ఓబుళాపురంలో ఘనంగా 'ఊరి దేవర'

పామిడి: మండలంలోని ఓబుళాపురం గ్రామంలో ఊరి దేవర కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు, టీడీపీ మండల ఇన్‌చార్జి ఈశ్వర్, నార్త్‌కెనాల్ జిల్లా ఉపాధ్యక్షుడు మీనుగ వెంకటేష్‌తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడిలో వచ్చే నెల 5న నిర్వహించే క్రికెట్ టోర్నీకి సంబంధించిన ప్రతులను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం నీలూరు గ్రామ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల విభాగానికి హాజరుకండి

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు రాజా సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే ఆ సమయంలో సంబంధిత అధికారి అందుబాటులో ఉండాలన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


క్రైస్తవ సమాధుల తోటలో ప్రమాదకరంగా మారిన గుంత

పామిడి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద క్రైస్తవ సమాధుల తోటలో సత్యసాయి ప్రాజెక్ట్ పైప్‌లైన్ మరమ్మతుల కోసం ఆ ప్రాజెక్ట్ సిబ్బంది గుంత తవ్వి వదిలేశారు. నెలరోజులైపా పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసిన పాపాన పోలేదు. ఇది ఆ ప్రాజెక్ట్ సిబ్బంది నిర్లక్ష్య ధోరణికి నిలువుటద్దంగా నిలుస్తోంది. ఈ గుంత లీకేజీ నీటితో నిండి మురికిమయమైంది. ఈ నీటి గుంత గుత్తి బీసీ సీరోడ్డుకు ఆనుకుని ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదవశాత్తు చిన్నారులు ఈ నీటిగుంతలో పడితే ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోవాల్సిందే. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతుల చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కనుల పండువగా రథోత్సవం


అలంకరణలో వెంకటేశ్వరస్వామి

యల్లనూరు: మండల కేంద్రంలో ఆదివారం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో రథాన్ని ప్రారంభించారు. ఏడాదికోసారి నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని గ్రామస్తులు ఐకమత్యంగా నిర్వహించారు. ఓం నమో వెంకటేశాయ, గోవిందా గోవిందా, శ్రీ వెంకటేశా గోవింద అని భక్తుల నామస్మరణలతో పురవీధులు మార్మోగాయి. రథాన్ని లాగేందుకు గొలుసు కోసం భక్తులు, ప్రజలు ఎగబడ్డారు. ఎండలు మండిపోతున్నా, ఇలవేల్పును దర్శించుకొని రథంపైకి పుష్పాలు చల్లేందుకు మిద్దెలపైకి భక్తులు ఎక్కి స్వామి రథం మీదకు చల్లారు. రథోత్సవానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, సర్పంచు పెద్ద ఓబులమ్మ, నాయకులు సుబ్బయ్య, కిరణ్ హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కోలాటం ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు ఆధ్వర్యంలో పుట్లూరు సీఐ సత్యబాబు, యల్లనూరు, పుట్లూరు ఎస్ఐలు రామాంజనేయరెడ్డి, నరసింహం, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


కోలాటం ఆడుతున్న భక్తులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220732, 9912220722, 7093156622